# మురికి

కలువకొలను సదానంద

ఊరి చివర రెండుబారల వెడల్పుతో సాగిపోయే ఆ మురుగు కాలువను రోజూ తిట్టుకుంటూ ముక్కు మూసుకుని భరించే ఆ ప్రాంతంలోని వాళ్ళందరూ చాలీ చాలని బతుకుల వాళ్ళే!

...భర్త పనికి వెళ్ళిపోయాడు. తొందర పనులేమీ లేవు. సరోజ తన పదినెలల కొడుకును చంకన బెట్టుకొని గుమ్మంలోకి వచ్చి నిలుచున్నది.

ఎట్టయెదుట మురుగుకాలవ. అవతలి గట్టున వరసగా చింతచెట్లు. కొండకొన అంచునుండి రెండుబారల ఎత్తుకు ఎగబాకి ఉన్న సూర్యబింబం చెట్ల గుబురుల్లోంచి కనిపిస్తోంది. పచ్చటి గుబురుటాకుల గుండా దూరి, మురుగుకాలవలో పడి వింత వింత రంగుల్ని సృష్టిస్తున్నాయి సూర్యకిరణాలు. పిట్టల అరుపులు తెరిపిలేకుండా వినిపిస్తున్నాయి. నీరెండ పడి సరోజ ఒళ్ళు, సరోజ తనయుని ఒళ్ళు మేలిమి బంగారంలా మెరిసిపోతున్నాయి.

సరోజ చూపు మరల్చింది. నీరెండలో తనయింటి గోడ వారగా ఒక ఆడకుక్క కళ్ళు మూసుకుని పడుకుంది. దాన్ని చుట్టుముట్టి నాలుగైదు కుక్కపిల్లలు పాలు తాగడానికి ఎగబడుతున్నాయి. సరోజ కొడుకు ఆ దృశ్యం కాస్సేపు చూసి, కాళ్ళు విదిలించుకుంటూ గబుక్కున తల్లి రొమ్ముల్లో తల దూర్చాడు. సరోజ సిగ్గువడి, క్రీగంట చుట్టూ ఒకసారి చూసి, పైట చెరగును కొడుకు ముఖానికి అడ్డంగా జార్చింది.

ఇంటిముందర ఇద్దరు కుర్రాళ్ళు-గంగాబాయి కొడుకు గోపీ, జానకమ్మ కొడుకు జగ్గూ-రబ్బరు బంతిని ఎగురవేసుకుంటూ ఆడుకుంటున్నారు. సరోజ వాళ్ళ ఆటను చూసింది. రబ్బరు బంతిని ఎగురవేనుకుంటూ ఆడుకుంటున్నారు. సరోజ వాళ్ళ ఆటను చూసింది. బంతిని చూసింది. బంతి చాలా బాగుంది. పెద్ద నారింజకాయలా ఉంది. నేల మీద మోదితే నాలుగు నిలువుల ఎత్తుకు ఎగిరిపడుతోంది. తన కొడుకు బంతి ఆడుతుండగా చూడాలన్న కోరిక మెదిలింది సరోజలో. కనీసం మరొక్క ఏడాదైనా గడిస్తే గానీ తన కొడుకు బంతి ఎగురవేయలేడు. ఆ ఒక్క సంవత్సరం ఇప్పుడే గడిచిపోరాదూ?...

మురుగు కాలవలోంచి ఎగిరివచ్చిన



దుర్గంధం-తీయటి కలలో ఉలికిపాటులా-ఆమె ముక్కుపుటాల దగ్గర సుళ్ళు తిరిగింది. "ఛీ! పాడుకంపు! రోజూ దీన్ని భరించడం ఒక ప్రళయమైపోతోంది" అంటూ చీదరించుకుందామె.

ఇంతలో బంతి ఆడుకుంటూన్న పిల్లల్లో ఏదో కలకలం రేగింది. వాళ్ళ బంతి మురుగు కాలవలోకి దొర్లిపడి, శాపగ్రస్తుడైన చంద్రుడిలా వికృతరూపం దాల్చింది.

జానకమ్మ గారబ్బాయి కాలవలోకి దిగబోయి ముక్కు మూసుకుని, "అబ్బా! పరమకంపు!" అంటూ వెనక్కొచ్చేశాడు.

గంగాబాయి కొడుకు గంభీరంగా వాడికేసి చూస్తూ, "నేను మాత్రం ఆ బంతిని ముట్టుకుంటాననుకున్నావేం?... నేనా పాడుకాలవలోకి దిగను, ఆ పాడు బంతి నాకొద్దు!" అనేశాడు. ఇద్దరూ కలిసి ఎటో దూరంగా వెళ్ళిపోయారు.

సరోజ ఆలోచనలు పలువిధాల పోయాయి. 'గంగాబాయి కొడుకు బంతిని పారేసిపోయాడు. ఇక దాన్ని ముట్టుకోడు. అది అలా ఆ కాలవలో పడి ఉండాల్సిందే! నేను దాన్ని తీసుకుంటే, అందులో తప్పేముంది?... ఆ బంతిని జాగ్రత్తగా దాచిపెట్టి, బాబు పెద్దవాడయ్యాక, ఆడుకోమని వాడి కివ్వచ్చు. 'ఇదెక్కడిది ఈ బంతి? మాదిలాగుందే!' అని అప్పుడు గంగాబాయి అంటుందేమో? ఆఁ... అంతవరకు ఇక్కడ ఈ అద్దె కొంపల్లో ఎవరుంటారో, ఎవరు పోతారో!' అనుకుంది.

పొద్దు మరొకబార పైకెక్కింది. సరోజ చుట్టూ జాగ్రత్తగా పరకాయించి చూసింది. మెల్లగా కాలవలోకి దిగింది. గాజు పెంకులు, కుండ పెంకుల నడుమ బురదలో మునిగి ఉన్న బంతిని ఎడమచేతితో అందుకున్నది. గబగబ కాలవలోంచి ఇవతలి కొచ్చి గబుక్కున ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆమెకు చాలా ఆశ్చర్యం వేసింది. దుర్గంధాన్ని భరించలేని తాను కాలవలోకి ఎలా దిగగలిగింది?... బంతిని ఎలా తీయగలిగింది?... ఆ చెడు వాసన తనకు తగలకపోవడానికి కారణమేమి?

దొంగతనం చేస్తున్నామన్న భయం! ఔను! తాను దొంగతనమే చేసింది. బాబు కోసం బంతిని దొంగిలించింది!... ఆమెలో ఏదో భయం ఆవహించింది. సరోజ బంతిని కడిగింది. దాన్ని పిడకల గోతంలో దాచిపెట్టింది.

మధ్యాహ్నం కావస్తోంది. సరోజ అన్నం తిందామని కంచం కడుక్కుంటూ ఉండగా, బయటినుంచి ఏదో హంగామా వినిపించింది. గంగాబాయి గొంతు గింగురు మంటూ మార్మోగిపోతోంది. సరోజ బయటికి రావటానికి భయపడింది. కిటికీలోంచి బయటికి చూసింది.

గంగాబాయి కొడుకు రెక్క పట్టుకొని, కోపంతో అగ్గిలా మండిపడుతోంది.

"ఎక్కడుందిరా కాలవలో? కనిపించదే! వెధవా! అడ్డమైన వాళ్ళతో జతకట్టడం, వస్తువులు పోగొట్టుకోవడం! దొంగలతో సావాసం వద్దూ అంటే వినవు కదా! అఘోరించు!" అంటూ వాణ్ణి చెడామడా నాలుగు బాదింది. "పది రూపాయలు పెట్టి కొన్న బంతమ్మా! ఏ అల్పాయుష్కుడి వాత బడిందో, వాడి చేతులు విరగా!" అంది మళ్ళీ కసిగా.

సరోజ మనస్సు చివుక్కుమంది. గంగాబాయి ముఖం చూసే ధైర్యం లేక లోపలే ఉండిపోయింది.

గంగాబాయి కేక పెట్టింది-"ఏవమ్మో సరోజా! మా వాడు కాలవలో పారేసుకున్న బంతి ఏమైపోయింది?"

సరోజ సమాధానమివ్వలేక తటవటాయించింది. "అదేమోనమ్మా, నాకేం తెలును? బంతి ఆడుకునే పిల్లలు నాకెవరున్నారు?" అంది తలుపు చాటున నిలబడి.

"ఎవర్నడిగి ఏం లాభం? పోయిన బంతి వస్తుందా? శాపనార్థాలకు జడిసే రకాలైతే కదూ? వాళ్ళ చేతులు పడిపోనూ! వాళ్ళ కొంపలు కొల్లబోనూ! వాళ్ళ బిడ్డలు వాళ్ళకు దక్కవద్దూ?" అంటూ తిట్ల దండకం ఏకరువు పెడుతూ వెళ్ళిపోయింది గంగాబాయి.

సరోజ నిలువెల్లా వణికిపోయింది. ఉయ్యాల దగ్గరికి పరుగుతీసిందామె.


బాబు ఉయ్యాలకు కట్టిన చిలకలతో ఆడుకుంటూ నవ్వుకుంటున్నాడు. వాణ్ణి పైకెత్తుకుని, తన గుండెలకు హత్తుకుని, నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది సరోజ. "ఈ రోజంత చెడు రోజు లేదు. నా బాబును ఎన్నెన్ని మాటలంది! అన్నీ విని ఊరుకున్నాడు నా చిట్టి తండ్రి!"

ఒడిలో ఒళ్ళు మరిచి నిద్రపోయిన బాబును ముద్దెట్టుకుని ఉయ్యాలలో పడుకోబెట్టింది. పిడకల గోతంలో ఉన్న బంతిని బయటికి తీసి, ఎవరూ చూడకుండా

దాన్ని కాలవలోకి విసిరేసింది.

పావుగంట తరవాత గంగాబాయిగారి పిండి జల్లెడ చేతబట్టుకుని ఆమె ఇంటికి వెళ్ళింది సరోజ. జల్లెడ గంగాబాయి చేతి కందించి, "ఏమిటి పిన్నీ! ఇందాకా ఏదో బంతి పోయిందని హడావుడి చేస్తూ ఉన్నారే, బంతిలాంటిదేదో కాలవలో ఉంది మరి!" అంది అమాయకత్వం నటిస్తూ.

గంగాబాయి బయటికి నడిచింది, "ఏదీ, చూపించూ..."



'బాబు ఉయ్యాలకు కట్టిన చిలకలతో ఆడుకుంటూ నవ్వుకుంటున్నాడు. వాణ్ణి పైకెత్తుకుని తన గుండెలకు హత్తుకుని నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది సరోజ.'
ఆ కన్నీటి వెనక ఎంత అమ్మ రోదనో!!...

అంటూ.

"అదిగో ! ఆ రాళ్ళ పక్కన...బంతే కదూ అది?" అంటూ వేలెట్టి చూపింది సరోజ.

"ఔనౌను-బంతే! నేనిందాకా వెతికాను. కనిపించనే లేదు సుమా!...ఇదిగో అమ్మాయ్! నీ కడుపున నా వంటి ఆడకూతురు పుడుతుంది గానీ, దాన్ని యిలా అందుకో తల్లీ !"

"ఎబ్బే! ఆ కంపు నేను భరించలేను తల్లీ!" అంటూ గబుక్కున ముక్కుపట్టుకుంది సరోజ.

గంగాబాయి బురదలోనుండి బంతిని బయటికిలాగి ,"నా నాలుక తెగిపోనూ! తొందరపడి ఇరుగుపొరుగు వాళ్ళనందర్నీ అనరాని మాటలన్నానే! అయ్యయ్యో ఎంతపని జరిగిపోయింది!..." అంటూ తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చింది.

ఇది విని సరోజ మనస్సు తేలిక పడింది. ఆమె సంతోషంగా ఇంట్లోకి వెళ్ళింది. ఉయ్యాలలో కొడుకు నిద్రపోతున్నాడు. సరోజ వాడి ముఖాన్ని వాత్సల్యంతో చూసింది.

"దొంగ! అంతా వీడి మూలంగానే ! పైగా, ఏమీ తెలీనట్లు ఈ దొంగ నిద్ర ఒకటి!..." అంటూ ముందుకు వంగి, వాడి లేత చెంపను ముద్దెట్టుకున్నది..

* "ఏం పరీక్ష రాస్తున్నావు బాబూ!?" అడిగాడు శ్రీనివాసరావు ఉండలేక ఎదురింటి అబ్బాయిని.

"లీక్‌సెట్ సార్!!!" చెప్పాడు ఆ కుర్రాడు.

* చెట్ల ఉపయోగాలు తెలుసుకోవడానికి టీచర్ విద్యార్థులను ఇలా ప్రశ్నించాడు.

"అశోకుడు చెట్లు ఎందుకు నాటించాడు?"

దానికి ఓ విద్యార్థి-

"మొక్కలైతే పెరిగి పెద్దయ్యేసరికి చాలా సమయం పడుతుంది కనుక!!"

**-జెండి వెంకటరమణ,**
**కూనజమ్మన్నపేట,శ్రీకాకుళం జిల్లా.**

* "కోడి గుడ్డు పెడుతుంది. ఆవు పెట్టదు. ఎందుచేత?!"

"కోడి పొట్టిగా వుంటుంది. ఆవు పొడువుగా వుంటుంది. గుడ్డు పెడితే కిందపడి పగిలిపోతుంది. అంచేత పెట్టదు."

* "ఏమిటీ...తలకి ఆ దెబ్బ?!"

"మా ఆవిడ కరివేపాకు విసిరింది."

"కరివేపాకుతో దెబ్బ తగులుతుందా?!"

"కరివేపాకు రాల్చడం కోసం కర్రకూడా విసిరిందిలే."

* "నదిలో ప్రయాణిస్తున్న ఓ పడవకు ఉన్నట్లుండి చిన్న రంధ్రం పడి నీళ్ళు లోనికి వచ్చేశాయనుకో. అప్పుడు నువ్వా పడవలో వుంటే ఏం చేస్తావ్?" ప్రశ్నించాడు ఇంటర్వ్యూ అధికారి భార్గవ్‌ను.

"మరో రంధ్రం చేస్తే సరి! లోపలికి వచ్చిన నీళ్ళు బయటకు వెళ్ళి పోతాయి.."

"ఆహా....ఏం తెలివి నాయనా! అమోఘం!!"

* ఫోన్లో గంటల తరబడి మాట్లాడే అలవాటున్న సుగుణ ఆ రోజు ఓ అరగంట సేపు మాట్లాడేక ఫోన్ పెట్టేసింది.

"వెరీ గుడ్. ఇన్నాళ్లకి సమయం విలువ తెలిసిందన్నమాట. ఇంతకీ ఎవరా ఫ్రెండ్?!" అడిగాడు ఆమె భర్త ఉదయ్.

"అబ్బే ..ఫ్రెండ్ కాదు. రాంగ్‌నెంబర్..." చెప్పింది ఆమె.

* "మన దేశ జనాభా ఎంతో కరెక్టుగా చెప్పగలవా?!" అడిగాడు ఇంటర్వ్యూ అధికారి సుధాకర్‌ని.

"తొంభై కోట్ల ఎనిమిది లక్షల అరవై వేల నాలుగొందల నలభై నాలుగున్నర పాయింట్ అయిదు మూడు ఒకటి...."టపీమని చెప్పుకుపోతున్నాడు సుధాకర్.

"అదేంటయ్యా...మరీ అంత అరలు-నరలు, పాయింట్లు ఎలా చెప్పగలుగుతున్నావ్?"

"ఏముందండీ...ఇప్పటికిప్పుడు పుడుతున్నవాళ్ళు, ఆయా క్షణాల్లోచేస్తున్నవాళ్ళనుకూడా కౌంట్‌లోకి తీసుకుంటున్నాను."

* ప్రచార సాధనాల గురించి పాఠం చెప్పిన



మాస్టారు-

"ఒరేయ్ కృష్ణా! రేడియోకి, టీ.వి.కి తేడా చెప్పు?!" అడిగాడు కృష్ణని.

"మీరు, మీ భార్య మీ ఇంట్లోనే పోట్లాడుకున్నారనుకోండి అది రేడియో. అలాకాక,నడిబజార్లో పోట్లాడుకుంటే అది టీ.వి. అవుతుంది." చెప్పాడు కృష్ణ సిన్సియర్‌గా.

* "ఇంటికొచ్చిన అతిథులను ఎలా వదిలించుకుంటావోయ్ నువ్వు?"అడిగాడు రమేష్ కిషోర్‌ని.

" ఏముంది..చాలా సింపుల్. అలాంటి సందర్భంలో మా ఆవిడ ఏదో వంకన నన్ను లోపలికి రమ్మని పిలుస్తూ కేకలేస్తుంది, ఆ అతిథికి వినబడేలా..." చెప్పాడు కిషోర్.

కిషోర్ మాటలు పూర్తి కాకముందే లోపలినుండి అతని భార్య గొంతు ఖంగుమంది.

"అల్మారా నిండా బొద్దింకలు పెరిగిపోయాయ్. వాటి సంగతి చూడమని చెప్పి వారమైంది. ఏమైనా పట్టించుకున్నారా అసలు..."

* "నువ్వు ఆ పారిశ్రామిక వేత్తను చంపాలనే ఉద్దేశ్యంతో అతడి కణతలమీద నీ రివాల్వర్ గురిపెట్టికూడా చివరి క్షణంలో పేల్చలేదట...ఎందుకని?!" అడిగాడు లాయర్ ముద్దాయిని.

"ట్రిగ్గర్ నొక్కే సమయానికి ఆయన 'రివాల్వర్ బాగుంది. నువ్వు కొన్నదానికి వందింతలు ఎక్కువిస్తాన'న్నాడు. అందుకే...."

-కె.నాగేశ్వరరావు,విజయవాడ

కలర్ టి.వి. కేవలం 300 రూ/-లకే.
కేవలం 300 రూపాయలకే అందమైన పాకెట్ సైజు కలర్ టి.వి. పొందండి. మా స్కీము ద్వారా 8 సంవత్సరాల గ్యారంటీ. పోస్టేజి, పాకింగ్ చార్జీలు అదనం. స్టాక్ పరిమితంగా ఉంది. అందుచే మీ ఆర్డర్‌ను వెంటనే పంపండి.
SRI BALAJEE TRADERS
P.O. MAIRA BHRITH (GAYA)